# కాలే పొట్టా? కాదు వీపు

సముద్రం నీలంగా వుంటుంది. ఆకాశం ప్రతిఫలించి, మధ్యాహ్నం పూట మరింత నీలంగా, దూరాన ఆకుపచ్చగా వుంటుంది. తీరాన నిలబడి చూస్తోంటే చైతన్యం వుబికి, కెరటాలుగా వచ్చి విరిగి, నురుగులుగా వెనక్కి పరుగెడుతుంది. ఎంతో విస్మయం గొలుపుతుంది. ఆశ్చర్యమూ, భయమూ కలుగుతుంది.

ఆ దృశ్యం నుంచి వెనక్కి తిరిగి ఎదురుగా చూస్తే తెల్లని యిసుక, ఆ చివర దిబ్బలుగా పేరుకున్న యిసుక కనిపిస్తాయి. అంతా నిర్మానుష్యం. కానీ ఆ యిసుక దిబ్బల కింద దూరదూరంగా తవ్విన గోతులు కనుపిస్తుంటాయి.కొన్ని గోతులలో ఆడమనుష్యులుంటారు. బతికివున్నవాళ్లే. నిర్మానుష్యమైన ఆ ప్రదేశంలో గోతులెందుకు తవ్వారు? అందులో మనుష్యులుండటమేమిటి?

చాలామందికి అర్థంకాని విషయం. ఆడవాళ్లు అక్కడ తమపని తాము నిర్వర్తించుకుంటున్నారు. వంటరిగాకాదు. తమకోసం వచ్చిన పురుషులను సంతృప్తి పరుస్తున్నారు.

సముద్రతీరం బహిరంగ ప్రదేశం. ఇసుక కాలిపోయి వళ్లు మండిపోతుంది. కానీ గోతుల్లో అయితే నల్లని మట్టి వుంటుంది. అంతగా వేడెక్కకుండా కొంత భాగమైనా చల్లగా వుంటుంది. ఐనా ఆ ఆడవారినే అడగాలి. ఎంత బాధ, ఎంత లాభం, ఎంత గౌరవం, అగౌరవం - దాపరికం ఎంత -దాక్కొనేది ఎంత అని తెలుసుకోవాలంటే వాళ్లనే అడగాలి.

కానీ మాట్లాడ్డానికి తీరుబాటు వుందా వాళ్లకి- ఓపిక వుందా - సాయంత్రం నాలుగులోపు వాళ్ల పిల్లలు వచ్చేసరికి యీ పని ముగించుకొని, కొన్ని వందలు చేతుల్లో పడేయించుకొని యింటికి చేరాలి. తమ 'ఉదర' పోషణార్ధమేకాక బిడ్డల ఉదరాలు నింపడం కోసం కూడా వారీ పని చేయాలి. ఆమెకు అలమేలు అని అమ్మవారి పేరు పెట్టినప్పుడు తల్లి, తండ్రి అనుకుని వుండరు, గోతుల్లో శృంగారానికి లోనవుతున్న జీవితంలో తమ కూతురు పడి పోతుందని వారు వూహించి వుండరు. అటువంటి భవిష్యత్తే ఆమెకు వ్రాసి వుంటే ఆనాడే గొంతు నులిమి పడేసేవారేమో!

అలమేలు ఏడువరకు చదువుకొంది. ఆరులో వుండగానే పెద్దమనిషైంది. ఖాళీగా వున్న మగపిల్లలు ఆమె వెంట పడటం మొదలుపెట్టారు. పొద్దున్న పాల పాకెట్టుకి వెళ్లడంతో ఆరంభమై కూరలకి వెళ్లినా, వాకిలి వూడ్చి ముగ్గులేస్తున్నా - ఆకతాయి కుర్రవాళ్ల బెడద తప్పలేదు. తల్లి, తండ్రి బైట పనులకు వెడతారు. మింగేటట్లు చూసే పోకిరి కుర్రాళ్లు, మధ్య వయస్సు మగవాళ్ల నుంచి అలమేలుని ఎల్లా కాపాడాలో తెలియలేదు అమ్మకీ నాన్నకీ.

ఒకరోజు బస్సులో కూచోపెట్టి, మామయ్యగారింటికి వెళ్లి నెలరోజులుండిరా అని పంపించారు. ఆ కాసిని రోజులైనా యీమెను కాపాడే బాధ్యత తప్పుతుందని. బెదురు కళ్ల అలమేలు దిక్కులు చూస్తున్న తీరు ఒక మగాడిని ఆకర్షించింది. రెండు గంటల ప్రయాణం. పది రూపాయలిచ్చాడు నాన్న, ఎందుకేనా మంచిది వుంచుకొమ్మని.

ప్యాసెంజరు బస్సు మూడు చోట్ల ఆగుతుంది. మొదటిసారి ఆగినప్పుడు చాలామంది దిగారు కిందికి. ఆ మగవాడు దిగాడు. సోడాతాగి, సిగరెట్టు వూది, తిరిగి బస్సు ఎక్కేటప్పుడు అలమేలును పరీక్షగా చూశాడు. కాస్సేపటికి అలమేలు వెనక్కి తిరిగి చూసేటప్పటికి అతను ఆమెవేపే చూస్తున్నాడు. తెల్ల పంచె, సిల్కులాల్చీ, మంచి ఫ్రేము కళ్లద్దాలు సినిమా హీరోలాగా కనపడ్డాడు ఆమె కళ్లకి. తనవేపే తదేకంగా చూస్తూ, చిరునవ్వు విసిరిన అతనిని మళ్లీ మళ్లీ చూడాలనిపించింది.

రెండోసారి బస్సు ఆగినపుడు దిగుతున్న జనంలోంచి కొంచెం పక్కకు తప్పుకొని. "కాఫీ యిప్పిస్తానురా, దిగు" అన్నాడు. అలమేలు బిత్తరపోయింది.

"వద్దు..వద్దు!" అన్నది.

"డబ్బులు లేకపోతే ఫరవాలేదులే రా!" అన్నాడు.

"నా దగ్గర డబ్బులున్నాయి" అన్నది.

"ఉంటే దాచుకో, దిగు" అన్నాడు.

ఆడవాళ్ల సీటులో వున్న ఒకరిద్దరు దిగిపోయారు. మిగతావారు పళ్లు, బజ్జీలు, సోడాలు అమ్మేవారితో బేరాల్లోపడ్డారు. అంచేత అలమేలు యీ కొత్త మనిషితో మాట్లాడినది ఎవరూ పెద్దగా పట్టించుకోలేదు. వాళ్లిద్దరూ చూట్టాలో, పరిచయస్తులో అని కూడా అనుకుని వుండొచ్చు.

అలమేలు తన సంచీ చేత్తో పుచ్చుకునే దిగింది. చిన్న హోటలు, లోపల నాలుగు బెంచీలు, కుర్చీలు. ఆడవాళ్లు ఒకరిద్దరు బయట దూరంగా నుంచుని టీలు తాగుతున్నారు. అలమేలుని తీసుకెళ్లిన ఆయన లోపలకు నడిచాడు. వెనకాల బెంచీల్లో ఒకటి ఖాళీ వుంది. అలమేలుని కళ్లతోనే ఆహ్వానించి అక్కడ కూర్చోపెట్టాడు.

"ఆకలేస్తోందా?" అన్నాడు. గుబురు మీసాలు,నొక్కుల క్రాపింగు, అలమేలుకి నిజంగానే ఆకలేస్తోంది. "ఊహూ.." అన్నది. రెండు ప్లేట్లు వడ తెప్పించి పెట్టాడు. ఆపచ్చడి, సాంబారు జన్మలో రుచి చూడనట్లు తిన్నది ఆమె. కాఫీ వచ్చింది. ఎవ్వరూ ఎప్పుడూ తనని ఆదరించి పద్ధతిగా కప్పులో కాఫీపోసి యివ్వలేదు. అంతమంది మగవాళ్లమధ్య కూర్చోడం, ఎవ్వర్నీ తగలకుండా నడవడం అన్నీ కొత్తే. వక్కపొడి కొని నములుతూ, సిగరెట్టు అంటించుకున్నాడు. అలమేలు బెంచీలు, బల్లలు దాటి మగవారిని తప్పించుకుంటూ బయటకు వచ్చింది.

విలాసంగా గాలిలో పొగవూదుతూ ఆయన "అదుగో మన బస్సు వెళ్లిపోతోంది" అన్నాడు. అలమేలు పరుగెత్తపోయింది. కంగారుగా "పిలవండి, పిలవండి" అన్నది. బస్సుకి వినిపిస్తుందా? తాపీగా వెనక్కి తిరిగి, "నేను యింకో బస్సు ఎక్కిస్తాలే.. వూ.. వూ.. ఛార్జీలు నేనే యిస్తా. అందాకా, మా వాళ్ల యింటికి వెడదాం రా" అన్నాడు.

అల్లా పక్క సందులోకి, యింకా యింకా గొందుల్లోకి, మురికి గదుల్లోకి కిరాతక హస్తాలలోకి జారి జారి పడిపోయింది అలమేలు. డబ్బులు దొరికాయి, తిండి దొరికింది, చీరెలు దొరికాయి, క్లిప్పులు, రిబ్బన్లు దొరికాయి. మామయ్యగారింటికి చేరనే లేదు. అమ్మ,నాన్నకి ఆచూకీ తెలుపనేలేదు.

ఎందుకు? అయోమయంలో, భయంలో, అవమానంలో గడిచిపోతున్న బతుకు ఎల్లా మలుపు తిప్పాలో తెలీదు.

సముద్రం వద్దున గోతుల్లో పడిపోయింది. ఎందుకో, ఎల్లాగో, ఎప్పుడో ఒక పిల్లవాడు పుట్టాడు. తన వృత్తిలో వాళ్లే ఆదుకున్నారు. పురుడు పోశారు. వీధికుక్క బతుకైంది.

"ఎక్కడికి పోతావులే!" అన్నారు.

అదో కూటమి, అదో సంఘం, అదో స్నేహ బృందం. దోపిడీ చేస్తున్న పురుష జన సందోహం.

సముద్రం, కనుపించే నీలాకాశం సాక్షులుగా, తలలూపి సన్న చప్పుడు చేసే సరుగుడు చెట్ల రోదనం నేపథ్యంగా, ఎండలో గోతి మట్టిలో కాలిపోతున్న అలమేలు వీపు సాక్షిగా, బండ వెధవ జాతి మగవారి సాక్షిగా వాస్తవం. ఇదంతా, చేతిలో పడుతున్న నోట్ల కాగితాలు మాత్రమే ఒక పరమ సత్యంగా బతుకు గడుస్తోంది. చరిత్ర నడుస్తోంది.

**(ఇది వాస్తవ గాథ)**